క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో విలువైన ప్రభుత్వ భూమలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్‌కు పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పాలనలో కౌన్సిలర్లు, నాయకులు కబ్జా చేశారన్నారు. 28వ వార్డులో ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేసిన షెడ్డు తొలగించాలన్నారు. కబ్జాపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి రమేశ్, పూదరి శివరేణుక, సజ్జు, నాగరాజు, మహేందర్ తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులు, టీచర్లతో మాజీ సర్పంచ్ దామోదర్

గంగాధర: మండలంలోని కాసారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచు వేముల దామోదర్ శనివారం క్రీడా దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. పాఠశాలలో సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, హెచ్ఎం శశికాంత్‌రెడ్డి, మాజీ సర్పంచు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వేముల దామోదర్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు.

నూతన కార్యవర్గం



రెడ్డి ఐక్యవేదిక నూతన కార్యవర్గం

గన్నేరువరం: రెడ్డి ఐక్యవేదిక సమ్మేళన కార్యక్రమం శనివారం మండలకేంద్రంలో సంఘం నాయకులు, సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి ఐక్యవేదిక గన్నేరువరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతెల్లి రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నందికొండ స్వామిరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కాంతాల కిషన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా హన్మసుల తిరుపతిరెడ్డి, కాంతాల సురేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్లుగా బొమ్మడి సంపత్‌రెడ్డి, అన్నాసుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిగా నందికొండ సురేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిగా గడ్డం సుమిత్‌రెడ్డి, అడ్వైజర్‌గా సభ్యుడుగా దేవసాని తిరుపతిరెడ్డి నియామకమయ్యారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ గోపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు కాంతాల సత్యనారాయణరెడ్డి, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ విభాగం ఉపాధ్యక్షుడు కర్ర అశోక్‌రెడ్డి, మండల రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న స్నేహితులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన అవదూత రవీందర్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం దర్గవాడ స్నేహితులు రూ.42,00, హన్మాండ్ల వాడకు చెందిన స్నేహితులు రూ.11,000, ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ రూ.10,000, రజక సంఘం ఆధ్వర్యంలో స్నేహితులు రూ.12,000 మొత్తం రూ.75,000 మృతుడి భార్య, తల్లికి అందించారు. రవీందర్‌కు కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులను గ్రామస్తులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

మానకొండూర్: మానకొండూర్, ముంజంపల్లి, చెంజర్ల, గంగిపల్లి, కొండపల్కల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజేశ్వరీ శనివారం పరిశీలించారు. బీఎల్‌వోల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనతరం గంగిపల్లి గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్నారు.డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ...

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పోలింగ్ బూత్‌లో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను తహసీల్దార్ భాస్కర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం,ఆర్ఐ బాలకిషన్, కారోబార్ సదానందం, బీఎల్‌వోలు ఉన్నారు.

సాగునీరు పారేదెలా..?

- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- నీటిని విడుదల చేస్తే గండిపడే ప్రమాదం
- చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుందో లేదోనని ఆందోళన
- ఉపాధిహామీ కూలీలతో తొలగించాలని రైతుల డిమాండ్



అధ్వానంగా డీబీఎం 2 కాలువ



పూడిక, ముళ్లపొదలు, చెట్లతో ఆనవాళ్లు కోల్పోయిన డీబీఎం 3 కాలువ

మానకొండూర్: మండలంలోని 90 శాతం రైతులు కాలువల ఆధారంగా వ్యవసాయం చేస్తారు. యాసంగి సీజన్ మొదలైంది. మరో పది పదిహేను రోజుల్లో నారుమడి పోసే సమయం ఆసన్నమైంది. యాసంగిలో సాగునీరు ఎక్కువ అవసరం. కాలువల ద్వారా అధికారులు సాగునీరు విడుదల చేసినా ఆయకట్టు చివరికి సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కాలువలకు గండి పడే ప్రమాదం లేకపోలేదని వాపోతున్నారు. కాలువల్లో పూడిక పేరుకు పోవడమే కారణమని, ఉపాధి కూలీలతోనైనా తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పూడిక తొలగించేందుకు ఇదే అనువైన సమయం మని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కాలువలన్నింటిలోనూ పూడికే....

మండలం నుంచే ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువలు ప్రవహిస్తున్నాయి. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ పరిధిలో 9 ఉప కాలువలు ఉన్నాయి. ఒకటి, రెండు మినహా అన్నీ కాలువల్లో పూడిక భారీగా పేరుకుపోయింది. ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువ పూర్తిగా చెత్తా చెదారంతో నిండుకుంది. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, తోటపల్లి రిజర్వాయర్ ఎంఎంఆర్ 4 ఎల్ ఉపకాలువ ద్వారా 34 వేల ఎకరాల పైగసాగు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. డీబీఎం 2, 3, 4, 5, 8,9 ఉప కాలువలతో పాటు, ఎంఎంఆర్ ఉప కాలువల్లో చెత్తా చెదారంతో పూడిక భారీగా పేరుకుపోయింది. ఉప కాలువల పరిధిలోని 1 ఎల్, 2 ఎల్ వంటి చిన్న, చిన్న డిస్ట్రిబ్యూటరీల పరిస్థితి అంతే. డీబీఎం 2 ద్వారా గత వర్షాకాలంలో అధికారులు సాగునీరు విడుదల చేయగా పూడిక కారణంగా కాలువ చివరి వరకూ సాగునీరు వెళ్లకుండా సదాశివపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ భూమి నీట మునిగింది. కాలువ కనిపించనంతగా చెట్లు పెరిగి కాలువ ఉనికి కోల్పోయిందని, యాసంగిలో సాగునీరు విడుదలకుముందే కాలువల్లోని చెత్తా, పూడికను ఉపాధిహామీ కూలీలతో తొలగిస్తే కూలీలకు ఉపాధి, రైతులకు సాగునీరు అందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రూ. 30వేలు ఖర్చు చేశా



వర్షాకాలంలో డీబీఎం 2 ద్వారా సాగునీరు విడుదల చేయగా కాలువలోని పూడిక కారణంగా నా పంట పొలాలు నీట మునిగాయి. సొంతంగా రూ.30 వేలతో అడ్డుకట్ట వేశా. పూడిక తొలగించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదు.

– పత్తెం మహేందర్‌రెడ్డి, సదాశివపల్లి

అరమీటరు మేర పూడిక



చెత్తా, పూడిక పేరుకు పోవడం వల్ల కాలువలకు గండి పడే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రతి కాలువలో అరమీటరు మేర పూడిక పేరుకు పోయింది. పూడికను తొలగిస్తే సాగునీరు వెళ్లడమే కాకుండా కాలువలకు గండి పడే ప్రమాదం తప్పుతుంది.

– రాజు, ముద్దికుంట

చర్యలు తీసుకుంటాం

కాలువల్లో సిల్టును తొలగిచేందుకు నిధుల లేమి ఉంది. యాసంగిలో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం . ఏ ఏ కాలువల్లో పూడిక ఉందో పరిశీలించి, సిల్టు, చెత్త తొలగించేందుకు కృషి చేస్తా.

– వేణు, ఇరిగేషన్ డీఈ



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరితోపాటు వివిధ గ్రామాల్లో వీధికుక్కలు, కోతుల స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీధికుక్కలు చికెన్ సెంటర్లు, హోటళ్ల వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మరోవైపు కోతులు, కుక్కల దాడులతో చాలా మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. రోజుల తరబడి వైద్యం చేసుకోవాల్సి వస్తుందని బిక్కుబిక్కుమంటున్నారు. సంబంధిత, ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎం రమేశ్, గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్, సెల్ నంబర్ 9652402499

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

వైభవంగా గోపాష్టమి



గో పూజలు చేస్తున్న అర్చకులు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ శ్రీగిరిజా, శ్రీలక్ష్మీనర్సింహా, శ్రీవిద్యానంద గోశాలతోపాటు దాదాపు 12 గోశాల్లో శనివారం గోపాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గోరక్షా, బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్, రాష్ట్ర గోరక్ష కార్యవర్గ సభ్యులు ఊటుకూరు రాధాకృష్ణారెడ్డి, గోశాలల ప్రధాన అర్చకులు పురాణం మహేశ్వరశర్మ, రామ శంకరవర్మ, తీరునగరి వెంకటాద్రి స్వామి ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక గోపూజ వైభవంగా నిర్వహించారు. గోశాలల కమిటీ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, చల్ల మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మణ్‌రావు, నాలాల సందీప్‌కుమార్, పాలకవర్గం, గోరక్ష, బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టుల్లోకి మార్చాలి



వినతిపత్రం ఇస్తున్న ఆర్టిజన్ జేఏసీ నాయకులు

కొత్తపల్లి: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లోకి మార్పు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు శనివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ విద్యుత్ సంస్థలో 18 ఏళ్ల పైబడి విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఉద్యమ సమయంలో మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించగా.. ఉద్యమం చేపట్టడంతో విద్యుత్ సంస్థలో విలీనం చేసినట్లు వివరించారు. 23,667 మందిని పర్మినెంట్ చేసినట్లు అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. అయినప్పటికీ ఆర్టిజన్లను విద్యుత్ యాజమాన్య సంస్థ పూర్తిస్థాయిలో పర్మినెంట్ చేయకుండా విస్మరించిందని తెలిపారు., ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సేవలను గుర్తించి పర్మినెంట్ చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ శాఖ మంత్రికి లేఖ రాస్తానని, అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ ఎ.శివకృష్ణ తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, మేకల శ్రీనివాస్, ఈ.రవి, అబుషర్ పాల్గొన్నారు.

మానకొండూర్‌కు చేరకున్న పాదయాత్ర



కొత్తగట్టులో నాయకుల పాదయాత్ర

మానకొండూర్/శంకరపట్నం: ఎస్సీ వర్గీకరణ చేయొద్దని మాలమహానాడు నాయకులు భద్రాచలంలో ప్రారంభించిన పాదయాత్ర శనివారం మానకొండూర్‌తోపాటు శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చేరుకుంది. కాగా స్థానిక నాయకులు స్వాగతం పలికారు. రాజకీయ పార్టీలు దళితులను ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నాయని, రాష్ట్రంలో మాలల జనాభా శాతం తక్కువగా ఉందని అశాస్త్రీయ లెక్కలు చూపెడుతూ ఓవర్గం పనికట్టుకొని తప్పుదోవ పట్టిసుందన్నారు, డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, చిట్టమల్ల సమ్మయ్య, వెంకటస్వామి, వెన్న రాజు, మండల అధ్యక్షుడు కిష్టస్వామి, గరిగే ప్రభాకర్, వడ్ల రాజు, అర్జున్, ప్రణదీప్, బోడ సుధాకర్, అనిల్, శ్రీనివాస్ , మాల సంఘం నాయకులు వేల్పుల రాములు, ఉండింటి ఆంజనేయులు, బొల్లం రామస్వామి, అశోక్ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై పోలీసుల దాడి సరికాదు



కౌశిక్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, సతీష్‌బాబు

కరీంనగర్‌టౌన్: హుజూరాబాద్ చౌరస్తాలో అంబేడ్కర్ సాక్షిగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన పోలీసుల దాడిని ఖండిస్తున్నానని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కరీంనగర్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కౌశిక్‌రెడ్డిని శనివారం పరామర్శించారు. ఘటన జరిగిన తీరు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవిశంకర్ మీడియాతో మాట్లాడుతూ దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థికసాయం చెల్లించాలని కోరడమే కౌశిక్ రెడ్డి చేసిన తప్పా? అని ప్రశ్నించారు.అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ ఎమ్మెల్యే ఆరోగ్యం, భద్రతపై పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిని పరామర్శించిన వారిలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌బాబు ఉన్నారు.

ఇల్లందకుంట: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి అక్రమ అరెస్టును హుజూరాబాద్ నియోజకవర్గ యువ నాయకుడు చాతాల రంజిత్ ఖండించారు. పక్క రాష్ట్రాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని టీవీల్లో చూశాం కానీ హుజూరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దళితులపై దాడులు చేయించడం బాధాకరమన్నారు. రెండో విడత దళితబంధు వచ్చే వరకు పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలు పరిశీలన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రణవ్, తదితరులు

జమ్మికుంట: రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ధర్మారం, రామన్నపల్లిలో కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వం రైతుల విషయంలో చిత్తశుద్ధితో ఉందని పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని, సన్నాలకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లించే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. వ్యవసాయ అధికారులు, మిల్లర్లతో మాట్లాడామని ధాన్యం దిగుమతి చేసుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ధర్మారం సొసైటీ నూతన భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి, సుంకరి రమేష్, సొసైటీ వైస్‌చైర్మన్ మేడిపల్లి మొగిలి, సీఈవో శ్రీనివాస్, రైతులు నాయకులు పాల్గొన్నారు.

'దళితబంధు'తో ఎమ్మెల్యే రాజకీయ డ్రామా

హుజూరాబాద్‌రూరల్: దళితబంధు పథకంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రాజకీయ డ్రామా ఆడుతున్నారని, రెండో విడత దళిత బంధు నిధులు ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రణవ్ అన్నారు. సింగాపూర్ గ్రామంలో తన నివాసంలో మాట్లాడారు. రాజకీయ ఉనికి చాటుకునేందుకు ఎమ్మెల్యే దళితబంధు లబ్ధిదారులను ఆగం చేస్తున్నారని, రెండో విడత నిధులపై లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్లు ఎమ్మెల్సీ, విప్‌గా అధికారంలో ఉండి దళితబంధు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న వ్యక్తి పోలీస్ అధికారుల పట్ల వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్, నాయకులు కొలుగురి కిరణ్,సంధమల్ల బాబు, లావణ్య,పూదరి రేణుక, పర్లపల్లి నాగరాజు, సుంకరి రమేష్, ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, విఎడిదొడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

లెడ్ కాన్ఫరెన్స్



ఎంఈవోకు ప్రాజెక్ట్ వివరిస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని విజ్ఞాన్ నెక్స్ట్ జెన్‌లో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ జరిగినట్లు స్కూల్ కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ తెలిపారు. విద్యార్థులు వివిధ రకాలు చార్టులు, ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈవో భూపతి శ్రీనివాస్, స్కూల్ మార్గదర్శకులు జయవర్ధన్, ఫౌండర్ మహిపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే



సర్వే పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్

గన్నేరువరం: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో శనివారం సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 54 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొన్నారు. సర్వేను తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. స్టికర్ వేసిన ప్రతి ఇంటికి వచ్చి సర్వే చేయడం జరుగుతోందని, కుటుంబసభ్యులు వివరాలను వెల్లడించాలని కోరారు.

శంకరపట్నం: మండలంలో 14,822 కుటుంబాలను గుర్తించినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. 124 ఎన్యూమరేట్ బ్లాక్‌లు ఏర్పాటు చేసి సర్వే చేస్తున్నామని, శనివారం 410 కుటుంబాల సర్వే చేశామని, ప్రజలు ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు వివరాలు చెప్పాలని సూచించారు.

ఏర్పాట్లు పరిశీలన

మానకొండూర్‌రూరల్: దేవంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ప్రిన్సిపల్ జగన్నాథం శనివారం గ్రౌండ్‌ను పరిశీలించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించారు. పీఈటీలు ప్రవీణ్, శివప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి

సైదాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని కరీంనగర్ డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో హామీని అమలు చేస్తోందని, త్వరలోనే రైతుభరోసా ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

దీక్షకు తరలిరావాలి

గన్నేరువరం: గన్నేరువరం మండల ప్రజలు కరీంనగర్ వెళ్లడానికి మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టే దీక్షకు గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ శనివారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించే వరకు పోరాటం చేస్తామన్నారు.

దళితులను తప్పదోవ పట్టించొద్దు

జమ్మికుంట: దళితులను తప్పదోవ పట్టించేందకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ అన్నారు. కోరపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మాట్లాడారు. దళితుల కోసం ప్రాణత్యాగం చేస్తానంటున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పదవికి రాజీనామా చేస్తే తమకు దళిత బంధు వస్తుందన్నారు. అధికారులను కలిసి ప్రజల తరుపున మాట్లాడవచ్చు, దళితబంధు పేరుతో అమాయక ప్రజలను రెచ్చగొడుతూ రాజకీయంగా పబ్బం గడుపుకుంటూ నియోజకవర్గాన్ని రణరంగగా సృష్టించే పద్ధతి మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, సతీష్, సాగర్, రాజశేఖర్,తరుణ్, వంశీ ,రాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు

పాలనపై దృష్టి సారించాలి

చొప్పదండి: సీఎం రేవంత్‌రెడ్డి పాలన మీద దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హితవు పలికారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సీఎం పాదయాత్రలో కేసీఆర్‌పై తిట్ల పురాణం అందుకోవడాన్ని ఖండించారు. నిరంకుశత్వం వదిలి నిర్మాణాత్మక నిర్ణయాలపై శ్రద్ధ వహించాలని కోరారు. కేసీఆర్‌పై వ్యాఖ్యలు సీఎం నీచ సంస్కృతికి నిదర్శనంగా మారాయన్నారు.

ఘనంగా కేడీఆర్ జన్మదిన వేడుకలు



దివ్యాంగుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తిమ్మాపూర్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో మాజీ డైరెక్టర్ కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నాల సంపత్, మాదన రాజేందర్, మాశెట్టి శివకృష్ణ, కేతిరెడ్డి రాహుల్‌రెడ్డి, మాతంగి లక్ష్మణ్, పోతురాజు దేవేందర్, గడ్డి రమేశ్, మడుపు శ్రీనివాస్‌రెడ్డి, అడిసర్ల సత్యం, జక్కని రవి, గూడ తిరుపతి, అక్బర్, కొండ్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

తప్పిపోయిన బాలికను తల్లికి అప్పగించిన పోలీసులు

జమ్మికుంట: పార్క్‌లో అడుకుంటూ తప్పిపోయిన బాలికను పోలీసులు తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన తాండ్రాజుల రాజు, స్వప్న దంపతుల కూతురు సంజన(8)ను జమ్మికుంట పట్టణంలోని కృష్ణాకాలనీలో నివాసమండే తాత సమ్మయ్య కొండూరు కాంప్లెక్స్‌లోని పార్క్‌కు సాయంత్రం ఆడుకోవడానికి తీసుకవచ్చాడు. సమ్మయ్య ఇతరులతో మాట్లాడుతుండగా బాలిక పార్క్ నుంచి బయటకు వచ్చింది. బాలిక కనపించకపోవడంతో విషయం తల్లికి తెలియజేశాడు. ఆమె డయల్ 100 కాల్ చేయగా జమ్మికుంట పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి 20 నిమిషాల వ్యవధిలోనే బాలికను గుర్తించి తల్లికి అప్పగించామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సదయ్య, హోంగార్డు అలీమ్‌ను సీఐ రవి అభినందించారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

చొప్పదండి: మండలంలోని రాగంపేటకు చెందిన నీలం లచ్చయ్య (68) ఒంటరితనం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. లచ్చయ్య భార్య పదేళ్ల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. కుమారులు, కూతుళ్లు ఉన్నా భార్య లేదని బాధపడేవాడు. శుక్రవారం సాయంత్రం పురుగు మందు తాగాడు. గమనించిన చిన్న కొడుకు సంతోష్ కరీంనగర్, అక్కడి నుండి వరంగల్ ఎంజీఎంకు తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని, మృతుడి పెద్ద కుమారుడు శేఖర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఆటోట్రాలీని ఢీకొట్టిన టిప్పర్

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆటోట్రాలీని టిప్పర్ ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు..పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బ్లూకోల్ట్స్ పోలీసులు ప్రమాదంపై విచారణజరుపుతున్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

శంకరపట్నం: కుటుంబ సర్వే పేరుతో సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లకు స్పందించొద్దని కేశవపట్నం ఎస్సై రవి సూచించారు. సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లు క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతాల్లోని డబ్బు మాయం చేస్తారని సూచించారు.

ఖాసీంపేటలో చెట్ల నరికివేత

గన్నేరువరం: ఖాసీంపేట గ్రామ సమీపంలోని ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖకు చెందిన స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు 50 చెట్ల నరికివేశారు. ఈ మేరకు గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకట్‌రెడ్డి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.